క్లుప్తంగా

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

కేవీపల్లె : మండలంలో మంగళవారం నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ యాదవేంద్ర తెలిపారు. 5 సంవత్సరాల లోపు పిల్లలను నూతనంగా ఆధార్ కార్డు పొందడానికి, ఆధార్ ఉన్నవారు ఏమైనా మార్పులు, చేర్పులు చేయుటకు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ నెల 27వ తేదీ వరకు మద్దిపట్లవాండ్లపల్లె, గ్యారంపల్లెలో ఆధార్ ప్రత్యేక శిబిరాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

ప్రింటర్ లేక ప్రజల అవస్థలు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని పట్టెంవాండ్లపల్లి గ్రామ సచివాలయంలో ప్రింటర్ పని చేయక పోవడంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులకు పరీక్షా కాలం కావడంతో వారికి అవసరమైన కుల, ఆదాయ, ఈడబ్ల్యూఎస్ లాంటి ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నా వాటిని పొందేందుకు కమ్మచెరువు, కందుకూరు సచివాలయాలకు వెళ్లాల్సి వస్తోందని అసహనం వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా బ్యాంకుల్లో తీసుకున్న పంట రుణాల రెన్యువల్ కోసం వన్‌బి, అడంగల్ పొందాలన్నా ప్రింటర్ లేకపోవడంతో అవస్థలు పడాల్సి వస్తోందన్నారు. కనీసం ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని సచివాలయంలోని ప్రింటర్‌కు మరమ్మతులు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మదనపల్లి ఘటనతో అధికారుల అప్రమత్తం

పెద్దతిప్పసముద్రం: మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం రాత్రి జరిగిన విద్యుత్ ప్రమాదంలో రూ.కోట్ల విలువ చేసే రికార్డులు కాలి బూడిదైన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేకెత్తింది. ఈ నేపథ్యంలో అన్ని మండల స్థాయి అధికారులు అప్రమత్తం అయ్యారు. ప్రధానంగా రెవెన్యూ అధికారులు సోమవారం సిబ్బందితో కలసి సమీక్షించారు. కార్యాలయాల్లోని భూ రికార్డులు, విలువైన పత్రాలు భద్రంగా ఉన్నాయా, తలుపులు, కిటికీలు సక్రమంగా ఉన్నాయా, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగే అవకాశాలు ఉన్నాయా అని ఆరాతీశారు. తక్షణం వాటికి మరమ్మతులు చేసేలా చొరవ చూపుతున్నారు. ప్రధానంగా రాత్రివేళ కార్యాలయంలో నైట్ డ్యూటీ చేసే వారు అప్రమత్తంగా ఉండేలా ముందస్తు చర్యలు చేపడుతున్నారు.

రికార్డుల దగ్ధంపై ప్రభుత్వం స్పందించాలి

– వీసీకే పార్టీ నేత శివప్రసాద్ డిమాండ్

మదనపల్లె : మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో రికార్డులు దగ్ధం కావడంపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించి, రికార్డులు కాలిపోయాయా? కాల్చేశారా? అన్న విషయం తేటతెల్లం చేయాలని వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీయం శివప్రసాద్ డిమాండ్ చేశారు. మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో రికార్డులు దగ్ధం కావడంపై ఆయన తీవ్రంగా స్పందించారు. అగ్నిప్రమాదం జరిగిన తీరు పలు అనుమానాలకు తావిస్తోందని చెప్పారు. భూ కబ్జాలు – రికార్డుల మార్పిడిపై ముఖ్యమంత్రి శ్వేతపత్రం విడుదల చేస్తున్న సందర్భంలో, ఇలా రికార్డులు దగ్ధం కావడం వెనుక, కుట్ర కోణమే కనిపిస్తోందని చెప్పారు. ఈరోజు కొత్త సబ్ కలెక్టర్ బాధ్యతలు తీసుకుంటున్న నేపథ్యంలో, నిన్న రాత్రే సబ్ కలెక్టర్ కార్యాలయంలో అగ్నిప్రమాదం సంభవించడం, రికార్డులు కాలిపోవడం చూస్తుంటే, దీని వెనుక పెద్ద కుట్రే ఉన్నట్లు తెలుస్తోందని చెప్పారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి దోషులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని శివప్రసాద్ డిమాండ్ చేశారు.

మాలమహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధిగా హరి



హరిని సన్మానిస్తున్న మాలమహానాడు సంఘం నేతలు

కలికిరి: తిరుపతి పట్టణం యాత్ హాస్టల్‌లో సోమవారం నిర్వహించిన మాలమహానాడు రాష్ట్ర కమిటీ సమావేశంలో కలికిరి పట్టణానికి చెందిన ఎస్టీడీ హరిని మాలమహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు యామలా సుదర్శన్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా హరి మాట్లాడుతూ దళితులు, బడుగు, బలహీన వర్గాల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నేతలు భానుప్రకాష్, నరేష్‌కుమార్, విజయ్‌కుమార్, రెడ్డిప్రసాద్, సహదేవ పాల్గొన్నారు.

గుంటిపల్లిలో నీటి సమస్య

పెద్దతిప్పసముద్రం: మండలంలోని టి.సదుం పంచాయతి గుంటిపల్లి ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని సోమవారం పలువురు దళితులు ఈవోఆర్డీ యోగానంద దృష్టికి తీసుకొచ్చారు. తాము తాగునీటి సమస్యతో అల్లాడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. ప్రధానంగా కాలనీలో మినీ ట్యాంకు ఏర్పాటు చేసి నీటి సమస్యను పరిష్కరించాలని కోరగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని ఈవోఆర్డీ కాలనీ వాసులకు భరోసా ఇచ్చారు.


గొంతు విప్పాలి.. అభివృద్ధి సాధించాలి

- కొత్తపాలకులపై కోటి ఆశలు
- అసెంబ్లీ సమావేశాల్లో ప్రజా సమస్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి



మదనపల్లె: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 45 రోజులు పూర్తి చేసుకొని అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తోంది. ఎన్నికలకు ముందు ఓట్ల కోసం టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాన్, బీజేపీ నాయకులు కలసి అడ్డుగోలుగా హామీలను గుప్పించారు. సూపర్ సిక్స్ పేరుతో కొత్త పథకాలను తీసుకొస్తామన్నారు. రైతులు, వృద్ధులు, మహిళలు, ఉద్యోగులు ఇలా అన్ని వర్గాల వారిని కూటమి నేతలు హామీలతో నమ్మించారు. యువతకు 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగులకు నెలకు రూ.3వేల భృతి అన్నారు. స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ. 15 వేలు, ప్రతి రైతుకు ఏటా రూ. 20 వేల ఆర్థిక సాయం, ప్రతి మహిళకు నెలకు రూ.1500 చెల్లిస్తామన్నారు. ప్రతి ఇంటికి ఏడాదికి మూడు గ్యాస్ కనెక్షన్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని సూపర్‌సిక్స్‌లో ప్రకటించారు. అలాగే ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఇచ్చి రక్షిత తాగునీరు అందిస్తామన్నారు. పేదలను సంపన్నులను చేసే దిశగా పబ్లిక్, ప్రైవేట్ పీపుల్స్, పార్టనర్‌షిప్ (పీ4) పథకాలు తీసుకొస్తామని ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా స్కిల్ సెన్సస్ చేపట్టి తద్వారా ప్రజల నైపుణ్యత స్థాయిని పెంచుతామన్నారు. చిన్న మధ్యతరహా పరిశ్రమలకు, అంకుర సంస్థలకు ప్రాజెక్టు వ్యయంలో గరిష్టంగా రూ. 10 లక్షల వరకు సబ్సిడీ ఇస్తామన్నారు. అలాగే ప్రతి ఏడాది జాబ్‌క్యాలెండర్, మెగా డీఎస్సీ విడుదల చేస్తామని ప్రకటించారు. గృహ నిర్మాణానికి పట్టణాల్లో 2 సెట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్ల ఇంటి స్థలం మంజూరు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేస్తామన్నారు. చంద్రన్న బీమా పథకం కింద సహజ మరణానికి రూ. 5లక్షలు, ప్రమాద వశాత్తూ మరణిస్తే రూ. 10లక్షలు బీమా సౌకర్యం కల్పిస్తామన్నారు. అక్రిడేషన్ కలిగిన ప్రతి జర్నలిస్టుకు ఉచిత నివాస స్థలం, ప్రజలకు ఉచిత ఇసుక, విద్యార్థులకు ఫీజురియింబర్స్‌మెంట్ ఇలా ఎన్నో వాగ్దానాలను, హామీలను గుప్పించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి మొదటి అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తోంది. ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలు, హామీలపై అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యేలు చర్చించి వాటి అమలుకు ప్రభుత్వం కృషి చేసేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

రైతులను ఆదుకోవాలి



చంద్రబాబు కూటమి ప్రభుత్వం ఇంత వరకు రైతు భరోసా ఖాతాలకు జమ చేయలేదు. ఏటా రూ. 20 వేలు ఇస్తామన్నారు. రైతు భరోసా పేరును అన్నదాత సుఖీభవ అని పేరు మార్చడం తప్ప ఇంత వరకు అతీగతీ లేదు. ఖరీఫ్ సీజన్ ఊపందుకుంది. పెట్టుబడుల కోసం ఎదురు చూస్తున్నాం. కేంద్ర ప్రభుత్వ పీఎం కిసాన్ ఇదివరలోనే ఖాతాలకు జమ చేసింది. చంద్రబాబు నుంచి ఆడిూసే కన్పించడం లేదు. వేరుశనగ విత్తనాలు వేయడానికి సీజన్ ముగిసింది. ఈసారి 70 శాతం మంది రైతులు మా ప్రాంతంలో విత్తనాలు వేయలేకపోయారు. ఆశలు సన్నగిల్లుతున్నాయి. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

-మూలింటి నాగిరెడ్డి, అంగళ్లు, కురబలకోట మండలం

ప్రజా సమస్యలపై చర్చించాలి



రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై అసెంబ్లీలో ఎమ్మెల్యేలు చర్చించాలి. ఎన్నికలకు ముందు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఇచ్చిన హామీలను అమలయ్యేలా గట్టిగా ప్రయత్నించాలి. రాష్ట్రంలో ఎన్నికల తర్వాత నుంచి అల్లర్లు, హత్యలు, అరాచకం పరిపాటిగా మారాయి. శాంతి భద్రతలకు విఘాతం కల్గుతోంది. ప్రజలు భయపడుతున్నారు. అంతేగాకుండా ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడానికి పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టేలా చూడాలి. రాష్ట్రంలో శాంతి భద్రలను విఘాతం కలుగకుండా చర్యలు తీసుకోవాలి. ప్రత ఒక్కరికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

-మొలక గోపాల్ రెడ్డి, మొలకవారిపల్లె, కురబలకోట

పంటల బీమా మంజూరు చేయాలి



చంద్రబాబు కూటమి ప్రభుత్వం ఏర్పడి నెలన్నర అవుతోంది. ఇచ్చిన హామీలు సకాలంలో అమలు అయ్యేలా అసెంబ్లీలో లేవనెత్తాలి. ప్రధాన సమస్యలపై గళం విప్పాలి. మరో వైపు గ్రామాల్లో మలేరియా, డెంగీ జ్వరాలు ప్రబలుతున్నా ప్రభుత్వం నుంచి ఆశించిన స్పందన లేదు. రైతులకు వ్యవసాయ పథకాలు ఏమీ అందలేదు. రాయితీలు, పరిహారం, పంటల బీమా సంగతి ఏమిటన్నది తెలియక అయోమయంలో ఉన్నారు. ఉద్యాన పంటలకు డ్రిప్, స్ప్రింకర్లు అందేలా చూడాలి. రైతుల సంక్షేమంపై అసెంబ్లీలో గట్టిగా ప్రభుత్వాన్ని నిలదీయాలి. ప్రజలు, రైతుల పక్షాన వారి సమస్యలు పరిష్కరించేందుకు ప్రజా ప్రతినిధులు అసెంబ్లీలో చర్చించాలి.

-జి. రామచంద్రారెడ్డి, గోపాలపురం, కురబలకోట

రైతు భరోసా పెంచి ఇవ్వాలి



తెలంగాణలో ఇప్పటికే రైతు బంధు పథకం కింద రూ.2లక్షల వరకు ప్రతిరైతుకు రుణ మాఫీ చేశారు. మన రాష్ట్రంలో కూడా రైతు భరోసా సాయం పెంచి రైతులను ఆదుకోవాలి. ఈ విషయమై అసెంబ్లీలో చర్చించాలి. ఇప్పటికే ఖరీఫ్‌సీజన్ ప్రారంభమైంది. గతంలో ఖరీఫ్‌సీజన్‌కు ముందుగానే రైతు భరోసా డబ్బులు ఇచ్చేవారు. ఈ ప్రభుత్వం కూడా రైతుభరోసా తాలుకూ డబ్బులు ముందుగానే అందించి రైతులను ఆదుకోవాలి.

-నాగరాజ, రైతు, గుర్రంకొండ

రేషన్ పంపిణీ సక్రమంగా నిర్వహించాలి



ప్రస్తుతం రేషన్ పంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. గత ప్రభుత్వం రేషన్ వాహనాల ద్వారా సరుకులు ఇంటింటికి అందించే ఏర్పాటు చేసింది. ఈనెల రేషన్ పంపిణీ చాలా గ్రామాల్లో సక్రమంగా నిర్వహించ లేదు. ఈవిషయమై ప్రభు త్వం అసెంబ్లీ సమావేశాల్లో ఓ నిర్ణయం తీసుకొని ప్రజలకు ఇబ్బంది లేకుండా రేషన్ పంపిణీ చేయాలి .

- సుబ్బమ్మ, గుర్రంకొండ

హామీలు అమలు చేయాలి



గత ప్రభుత్వంలో ఖరీఫ్ సీజన్ రాగానే సకాలంలో మా ఖాతాకు రైతు భరోసా సొమ్ము జమ చేసేవారు. చేతికి సకాలంలో రైతు భరోసా సొమ్ము రావడంతో పంట సాగుకు అప్పులు చేసే పరిస్థితి ఎప్పుడు రాలేదు. కొత్తగా వచ్చిన టీడీపీ ప్రభుత్వం ప్రతి ఏటా రైతుకు రూ. 20 వేల రైతు భరోసా ఇస్తామని హామీ ఇచ్చారు. నేటికి కార్యరూపం దాల్చలేదు.

- వెంకటయ్య, చెరువుకిందపల్లె, పెద్దమండ్యం

స్త్రీ నిధి రుణాలు సద్వినియోగం చేసుకోండి



ఆటో డెబిట్‌పై అవగాహన కల్పిస్తున్న స్త్రీ నిధి మేనేజర్ అమరావతి

తంబళ్లపల్లె: మహిళా సంఘ సభ్యులు స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని స్త్రీ నిధి మేనేజర్ అమరావతి తెలిపారు. సోమవారం స్త్రీశక్తి భవన్‌లో ఆటో డెబిట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళా సంఘ సభ్యులు తీసుకున్న స్త్రీ నిధి రుణాలను తిరిగి సకాలంలో వారి పొదుపు ఖాతాలో చెల్లించాలన్నారు. ఆ ఖాతా నుంచి ఆటో డెబిట్ ద్వారా వాటిని జమ చేసుకుంటామన్నారు. 2024 సంవత్సరానికి గాను స్త్రీనిధి రుణాలు బి. కొత్తకోట మండలానికి రూ.3. 5కోట్లు, ములకలచెరువుకు రూ.5.54 కోట్లు, పెద్దమండ్యంకు రూ.3. 54 కోట్లు, పెద్దతిప్పసముద్రంకు రూ.4. 96 కోట్లు, తంబళ్లపల్లెకు రూ.4. 52 కోట్లు పంపిణీ చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇప్పటికే ములకలచెరువు మండలానికి రూ.2.8 కోట్లు, పెద్దమండ్యంకు రూ.1.1 కోట్లు, తంబళ్లపల్లె మండలంలో రూ.60 లక్షలు పంపిణీ చేసినట్లు తెలిపారు. గతంలో స్త్రీనిధి నుండి తీసుకున్న రుణాల బకాయిలు పెద్ద తిప్పసముద్రం మండలంలో రూ.32.36 లక్షలు, తంబళ్లపల్లెలో రూ. 11.11 లక్షలు, పెద్దమండ్యంలో రూ.1.61 లక్షలు, బి.కొత్తకోటలో రూ. లక్ష చెల్లించాల్సి ఉందన్నారు. ఈ బకాయిలను సకాలంలో చెల్లిస్తే ఇతర మహిళా సభ్యులకు రుణాలు ఇచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. సభ్యులు ఈ విషయాన్ని గుర్తించి తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లించాలని కోరారు. ఏపీఎం గంగాధర్, సీసీలు, సంఘమిత్రలు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

సంచార ఆధార్ సెంటర్లు

తంబళ్లపల్లె: మండలంలో మంగళవారం నుంచి ఈనెల 26 వరకు సంచార ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ కార్యాలయ ఏఓ ఆనందకుమార్ తెలిపారు. ఆధార్ అప్‌డేట్, బయోమెట్రిక్, కొత్త ఆధార్ కార్డుల నమోదు, ఆధార్‌కు ఫోన్ నెంబరు, మెయిల్ ఐడీ లింక్ చేయడం జరుగుతుందన్నారు. మంగళవారం కన్నెమడుగు, కొటాల గ్రామ సచివాలయాలు, 25న తంబళ్లపల్లె, 26న రేణిమాకులపల్లె గ్రామ సచివాలయాల్లో ఈ ఆధార్ సేవలు అందిస్తారన్నారు. ప్రజలు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

విద్యార్థుల్లో సృజనాత్మకను పెంపొందించాలి



వాల్మీకిపురం: వివిధ ప్రదర్శనలు, నమూనాలను చూపుతున్న విద్యార్థులు

వాల్మీకిపురం: విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను పెంపొందించాలని స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్లస్ హెచ్ఎం శ్రీదేవి అన్నారు. సోమవారం సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస రావు, జిల్లా విద్యాశాఖ అధికారి శివ ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక పాఠశాలలో శిక్షా సప్తాహ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభ్యసన సామాగ్రి ప్రదర్శనలో భాగంగా గోడపత్రికలు, రేఖ చిత్రాల, ప్రాజెక్టు నమూనాలు, విద్యా పరికరాలు, త్రీడి నమూనాలను ప్రదర్శించినట్లు తెలిపారు. పలువురు విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనురాధ, పర్వీన్‌తాజ్, వసుంధర, ఉమాదేవి, శోభారాణి పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



నమూనాలు పరిశీలిస్తున్న ఎంఈఓ రెడ్డిబాషా

కేవీపల్లె : విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ఎంఈఓ రెడ్డిబాషా అన్నారు. సోమవారం మండలంలోని వగళ్ల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శిక్షా సప్తాహ (విద్యా వారోత్సవాలు) కార్యక్రమంలో చేపట్టారు. విద్యార్థినులు వివిధ ఎగ్జిబిట్స్ (టీఎల్ఎం నమూనాలు) ప్రదర్శించడంతో ఎంఈవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షా సప్తాహ 4వ వార్షికోత్సవంలో భాగంగా ఈ నెల 28వ తేదీ వరకు మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యా వారోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. మొదటి రోజు టీఎల్ఎం డే, రెండవ రోజు సంఖ్యా శాస్త్ర నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమం, మూడవ రోజు క్రీడా దినోత్సవం, నాలుగో రోజు సాంస్కృతిక కార్యక్రమాల దినోత్సవం, ఐదవ రోజు నైపుణ్యాల దినోత్సవం, ఆరవ రోజు పర్యావరణ దినోత్సవం, ఏడో రోజు సామాజిక భాగస్వామ్య దినోత్సవం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం. శ్రావణి, ఉపాధ్యాయినులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

రాయచోటి అర్బన్ : విద్యార్థులు చదువుతోపాటు డయేరియా, మలేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులపై అవగాహనను కలిగి ఉండడం అత్యవసరమని మున్సిపల్ కమిషనర్ వాసుబాబు అన్నారు. సోమవారం పట్టణంలోని మాసాపేటలోని ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హాస్టల్ పరిసరాలలో నీటి నిలువతోపాటు చెత్తచెదారాలు పేరుకుపోకుండా చూసుకోవాలన్నారు. నీరు నిల్వ ఉంచిన డ్రమ్ములు, నీటి సంపులలో దోమల లార్వాలు పెరిగిపోకుండా నీటిని శుద్ధి చేయాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటినే సేవించాలన్నారు. జ్వరం, ఒళ్లు నొప్పులు ఉంటే వైద్యసిబ్బందిని సంప్రదించాలన్నారు. వర్షాకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధుల వ్యాప్తి పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలంటూ కోరారు.తప్పనిసరిగా దోమతెరలను వినియోగించాలన్నారు.

ప్రమాదంపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్

కలికిరి:
మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో చోటు చేసుకున్న అగ్ని ప్రమాద ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి ప్రమాదమా, మనుషుల తప్పిదమా నిగ్గు తేల్చాలని సోమవారం వీసీకే పార్టీ నేత పాలకుంట శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నూతన్ సబ్ కలెక్టర్ బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో గతంలో చోటు చేసుకున్న భూదందాలు బయటపడతాయని సిబ్బందే కుట్రకు పాల్పడినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. విచారించి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీసీకే నేతలు ముల్లంగి క్రిష్ణయ్య, వంగిమల్ల గురునాథ, గంగాధర్, హరినాథ, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి వృథాను అరికట్టండి

రాయచోటి అర్బన్ : పట్టణంలోని పలువీధులలో జరుగుతున్న తాగునీటి వృథాను వెంటనే అరికట్టాలని మున్సిపల్ కమిషనర్ వాసుబాబు, మంత్రి సోదరుడు రాహుల్‌రెడ్డిలు మున్సిపల్ అధికారులను ఆదేశించారు. సోమవారం పట్టణంలో 9వ వార్డు పరిధిలోని పలు వీధులలో పర్యటించారు. ప్రజలతో మాట్లాడుతూ ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పట్టణంలో పలుప్రాంతాల్లో చోటుచేసుకున్న పైపులైన్ లీకేజీలను ఎప్పటికప్పుడు అరికట్టాలంటూ సూచించారు. మురుగునీటి కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగింపజేయాలన్నారు. ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన వృథా మట్టిని, రాళ్లను రోడ్లపై వేస్తుండడం బాధాకరమన్నారు. ఇక ముందు రోడ్లపై ఎక్కడా చెత్తాచెదారం, మట్టి, రాళ్లను వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్ఐ మల్లికార్జునతోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

మట్టి అక్రమ రవాణాను అరికట్టాలి

సుండుపల్లె : మండల కేంద్రంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు అనుమతులు లేకుండా అక్రమ లేఔట్లకు మట్టిని తరలిస్తున్నట్లు గ్రామస్తులు చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల సమీపంలోని గుట్టకాడ బలిజపల్లెలో నుంచి ప్రభుత్వ భూమిలో గుట్టను జేసిబీ యంత్రాలతో తవ్వి వందలకొద్ది ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రెండు గ్రామాల మధ్య వందల ట్రాక్టర్లు తిరుగుతుండటంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. మట్టి అక్రమ రవాణాను అరికట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో ఆందోళనా కార్యక్రమాలు చేస్తామని తెలియజేశారు.

రోడ్డు మరమ్మతులు చేయించండి

రామాపురం : మండలంలోని నీలకంఠ్రావుపేట గ్రామ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. గత మూడు సంవత్సరాల నుంచి రోడ్డు మరమ్మతులకు కంకరను వేసి వదిలేశారని, ఆ రోడ్డుపై వెళ్లాలంటే నరకం కనబడుతోందని వాపోతున్నారు. గత ప్రభుత్వంలో చేపట్టిన పని కావడంతో బిల్లులు అవుతాయో, కావోనని, గుత్తేదారులు పని మధ్యలో వదిలేశారని తెలిపారు. గ్రామం నుండి మండల కేంద్రానికి, అగ్రహారం మూవిరెడ్డిగారిపల్లె, గాలంగుండ్లపల్లె, మాలపల్లి, గాండ్లపల్లె గ్రామాల ప్రజలు పాఠశాలలకు, ఉపాధ్యాయులు, వృద్ధులు, ద్విచక్రవాహనాలకు, ఆటోలు ఈ మార్గంలో వెళ్లాలంటే నరకయాతను అనుభవిస్తున్నారని తెలియజేస్తున్నారు. త్వరితగతిన రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలన్నారు.

శివాలయాలలో పూజలు

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని రాఘవరాజపురం, పట్టణంలోని భుజంగేశ్వర ఆలయాలలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలోని శివలింగాలకు ప్రత్యేకాభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేక అలంకరణలు చేశారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

- చెంబకూరులో సప్తగిరి గ్రామీణ బ్యాంకు నూతన భవనం ప్రారంభం
- జిల్లా సప్తగిరి బ్యాంక్ ఛైర్మన్ ఏఎస్ఎన్ ప్రసాద్



సప్తగిరి బ్యాంక్ చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న కృష్ణమూర్తి, ఆనంద్

రామసముద్రం: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని జిల్లా సప్తగిరి బ్యాంక్ చైర్మన్ ఏఎస్ఎన్ ప్రసాద్ అన్నారు. సోమవారం రామసముద్రం మండలం చెంబకూరు గ్రామ పంచాయతీ కేంద్రంలో సోమవారం సప్తగిరి గ్రామీణ బ్యాంక్ నూతన భవనాన్ని చైర్మన్ ఏఎస్ఎన్. ప్రసాద్ ప్రారంభించారు. చైర్మన్‌ను, భవనం ఇచ్చిన శ్రీనివాసులునాయుడును బ్యాంక్ సిబ్బంది సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ చెంబకూరులో బ్యాంక్ ప్రారంభించి సుమారు 40 సంవత్సరాలు గడుస్తోందని, మెరుగైన సౌకర్యం కోసం నూతన భవనంలోకి బదిలీ చేయడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరు బ్యాంక్ ఖాతాని కలిగి ఉండి, డిపాజిట్లు విరివిగా చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ రంగ బ్యాంకుల కన్నా అత్యధికంగా 8.6 వడ్డీ రేటు ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు బ్యాంక్ లావాదేవిలు సులభతరం కోసం మొబైల్ యాప్‌ను వాడి బ్యాంకు నుంచి రుణాలు పొంది, సకాలంలో చెల్లించి బ్యాంకు ప్రయోజనాలు కాపాడాలన్నారు.

రైతులకు రుణాలు ఇవ్వాలని వినతి

కేంద్రం ప్రవేశపెట్టిన కిసాన్ కార్డులు రైతులందరికీ అందజేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి , మండల అధ్యక్షుడు ఆనంద్‌నాయుడు సప్తగిరి గ్రామీణ బ్యాంకు చైర్మన్‌కు వినతి పత్రం అందజేశారు. అలాగే నాబ్‌స్కీమ్ కింద రైతులకు ఆవులు , గొర్రెలపై రుణాలు మంజూరు చేసి ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో మదనపల్లి రిజనల్ మేనేజర్ ప్రకాష్, బ్రాంచ్‌మేనేజర్ వినోద్, ఏపీఎం సుబ్రమణ్యం పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ అధ్యాపకులు

మదనపల్లె సిటీ: రోడు భద్రతా నియమాలు పాటించాలని ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి అన్నారు. సోమవారం స్థానిక కాలేజీ విద్యార్థులు హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు నిత్యం చోటు చేసుకుంటున్నాయన్నారు. వాహనాదారులు హెల్మెట్ వాడకం వల్ల ప్రాణాప్రాయ స్థితి నుంచి తప్పించుకోచ్చునన్నారు. దీనిపై విద్యార్థులు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో అధ్యాపకులు నాగలక్ష్మి, జ్యోతి, ఖాజావల్లి, కుసుమప్రియ, వనజ, రఫీ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనతో ముందుకు పోవాలి



విద్యార్థులకు ఫోల్డర్ ఫైల్స్ పంపిణీ చేస్తున్న ఈశ్వరయ్య

పెద్దమండ్యం: ప్రతి విద్యార్థి లక్ష్యసాధనతో ముందుకు పోవాలని గుర్రంకొండ రిడో సంస్థ ప్రధాన కార్యదర్శి ఐలా ఈశ్వరయ్య అన్నారు. మండలంలోని శిద్దవరం కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయంలో సోమవారం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న 29 మంది విద్యార్థులకు ఫోల్డర్ ఫైల్స్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో విద్యకు మించిన సంపద లేదన్నారు. ప్రతి ఒక్కరూ తాము ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు ఇష్టపడి చదవాలన్నారు. ప్రాథమిక స్థాయి నుంచి విద్యాభ్యాసానికి సంబంధించిన సర్టిఫికెట్స్‌ను ప్రతి ఒక్కరు భద్ర పరుచుకోవాలన్నారు. సర్టిఫికెట్స్ ప్రాధాన్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే వ్యక్తిత్వ వికాసంపై ముద్రించిన కరపత్రాలను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాణికుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్మితా సబర్వాల్‌పై చర్యలకు డిమాండ్

రాజంపేట టౌన్ : దివ్యాంగులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఐఏఎస్ స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలని విభిన్న ప్రతిభావంతుల రాజంపేట శాఖ అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్ డిమాండ్ చేశారు. స్థానిక విభిన్న ప్రతిభావంతుల కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐఏఎస్ అయిన స్మితా సబర్వాల్ చేసిన వ్యాఖ్యలు దివ్యాంగులను తీవ్ర మనోవేదనకు గురిచేశాయన్నారు. ప్రతిభకు వికలత్వం అడ్డు కాదన్నారు. దివ్యాంగులు ఐఏఎస్ అధికారులై ప్రజలకు ఎంతో సేవ చేస్తున్నవారు ఉన్నారన్న విషయాన్ని స్మితాసబర్వాల్ మరచిపోవడం బాధాకరమన్నారు. యూపీఎస్ఎస్సీ, ఏపీఎస్ఎస్సీలో అనేక మంది నకిలీ వికలత్వం సర్టిఫికెట్లు పొంది ఉద్యోగాలు పొందివున్నారని ఆయన ఆరోపించారు. అలాంటి వారిపై స్మితాసబర్వాల్ వంటి ఐఏఎస్ అధికారులు చర్యలు తీసుకొని నిజమైన దివ్యాంగులకు న్యాయం చేయాల్సిందిపోయి అనుచిత వ్యాఖ్యలు చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. శారీరక దివ్యాంగులకు రోస్టర్ పాయింట్ 53 వల్ల ఉద్యోగాలు పొందలేకపోతున్నట్లు ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

గ్రీవెన్స్ సెల్‌ను సద్వినియోగం చేసుకోండి

రామాపురం : ప్రతి సోమవారం జరిగే గ్రీవెన్స్ సెల్ కార్యక్రమాన్ని అన్ని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారంలో ఎప్పటికప్పుడు నిర్లక్ష్యం వహించరాదన్నారు. రైతులు తమ గ్రామాల పరిధిలోని సమస్యలను తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. ప్రధానంగా భూములకు సంబంధించిన అర్జీలు రైతులు అధికంగా భూ సర్వే చేయాలని ఫిర్యాదు చేశారన్నారు.